క్లుప్తంగా

ధరణి సమస్యల పరిష్కారం

నర్సాపూర్: ధరణి దరఖాస్తుల సమస్యల పరిష్కారం త్వరలో పూర్తి అవుతుందని మండల తహసీల్దార్ కమలాద్రి పేర్కొన్నారు. మంగళవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మండలంలోని రైతుల నుంచి గతంలో 536 ధరణి దరఖాస్తులు వచ్చాయని, వాటిలో ఇప్పటి వరకు 265 పరిష్కరించామన్నారు. మిగిలిన దరఖాస్తులను వారంలోగా నాటికి పరిష్కస్తామని చెప్పారు. కాగా ప్రస్తుతం ధరణి సమస్యలపై రైతుల నుంచి దరఖాస్తులు వస్తున్నాయని వివరించారు. ధరణి సమస్యలలో ఎక్కువగా పేర్లు, ఇంటి పేరు, భూముల విస్తీర్ణం తప్పుగా వచ్చిందనే దరఖాస్తులు వచ్చాయన్నారు. గతంలో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించిన అనంతరం వస్తున్న విన్నపాలను పరిశీలించి పరిష్కరిస్తామన్నారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం మెదక్ ఆర్డీఓ రమాదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ భూములకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. అలాగే కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ ఫైళ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అధికారులు సిబ్బంది సమయపాలన పాటించి విధులు నిర్వహించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సతీశ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

'నేటి నుంచి విధులను బహిష్కరిస్తాం'

చిలప్‌చెడ్(నర్సాపూర్): మా జీతాలు మాకు చెల్లించకుంటే బుధవారం నుంచి విధుల్లోకి రామని మండల పరిధిలోని చండూర్ గ్రామ పంచాయతీ కార్మికులు డిమాండ్ చేశారు. మంగళవారం ఈ సందర్భంగా కార్మికులు యేసయ్య, రత్నయ్య, నారాయణ మాట్లాడుతూ.. తమకు తొమ్మిది నెలల జీతం రావాల్సి ఉందన్నారు. తొమ్మిది నెలలుగా జీతం రాక కుటుంబ పోషణ కష్టతరమవుతున్న, తమను పట్టించుకునే వారు లేరన్నారు. అధికారులను జీతాల గురించి అడిగితే పంచాయతీలో నిధులు లేవు అంటున్నారు. మాకు జీతాలు ఇచ్చేవరకు మేం విధులకు హాజరుకామని, అంతవరకు కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటామన్నారు.

అమ్మ పేరుతో చెట్లను నాటాలి

పెద్దశంకరంపేట(మెదక్): ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు ప్రతీ బీజేపీ కార్యకర్త అమ్మపేరుతో ఒక మొక్కను నాటి సంరక్షించాలని బీజేపీ మండలాధ్యక్షుడు కోణం విఠల్ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో బూత్ లెవల్ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని గ్రామాల్లో కార్యకర్తలు మొక్కలు నాటడంతో పాటు అందరికి మొక్కల సంరక్షణ వల్ల కలిగే లాభాల గురించి వివరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రావణ్, సూర్యప్రకాష్, కృష్ణ, ప్రకాష్, విజయ్‌కుమార్, గంగారెడ్డి, సురేందర్, విఠల్, రాజు, సుభాష్ తదితరులున్నారు.

మొక్కలు సిద్ధం చేయండి

చిలప్‌చెడ్(నర్సాపూర్): వన మహోత్సవానికి సమయం దగ్గరపడుతుందని, ప్రతీ గ్రామంలోని నర్సరీల్లో మొక్కలను నాటేందుకు సిద్ధం చేయాలని ఏపీఓ శ్యాం అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని చండూర్ గ్రామంలోని నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలు నాటేందుకు గుంతలు తీయిస్తున్నామని, త్వరలోనే మొక్కలు నాటుతామన్నారు. మండలంలో 80 వేల మొక్కలు నాటేందుకు ప్రణాళిక తయారు చేసుకున్నాయని, లక్ష్యాన్ని వంద శాతం పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జితేందర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సహకారం

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని చిన్న ఘనాపూర్ ఉన్నత ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న నలుగురు అనాథ పిల్లలకు బ్యాగులు, సామగ్రిని పీఏసీఎస్ డైరెక్టర్ మల్లేశం మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల మాజీ చైర్మన్ శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సూక్ష్మపోషకాల కిట్లు అందజేత

చేగుంట(తూప్రాన్): వర్షాభావంతో వరిని నేరుగా విత్తుకొనే విధానంతో ఖర్చులు తగ్గుతాయని సెహగల్ ఫౌండేషన్ ప్రోగ్రాం లీడ్ వాణి అన్నారు. మండలంలోని బోనాల్ ఇబ్రహీంపూర్ గ్రామాల్లో మహిళా రైతులకు సూక్ష్మపోషకాలు, పురుగు మందుల కిట్లు అందించారు. ఈ సందర్భంగా వాణి మాట్లాడుతూ.. వర్షాభావం కారణంగా నేరుగా వరిని విత్తుకునే పద్ధతి పాటించాలని తెలిపారు. ఈ విధానంలో కూలీల ఖర్చు తగ్గించుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లు విజయ్, శ్రవణ్, మహిళా రైతులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపూర్‌లో మహిళలకు సూక్ష్మపోషకాల కిట్లు అందిస్తున్న సెహగల్ ప్రతినిధులు

ప్రతీ రైతుకు భరోసా ఇవ్వాలి



చిలప్‌చెడ్(నర్సాపూర్): సోమక్కపేటలో రైతులతో మాట్లాడుతున్న రాంచంద్రారెడ్డి



చేగుంట(తూప్రాన్): రెడ్డిపల్లిలో మాట్లాడుతున్న ఏడీఏ వసంతసుగుణ



కొడిపల్లి(నర్సాపూర్): మాట్లాడుతున్న జిల్లా అధికారి కరుణాకర్

చిలప్‌చెడ్(నర్సాపూర్): గత ప్రభుత్వం మాదిరి ప్రతీ రైతుకు రైతు భరోసా ఇవ్వాలని మండల రైతులు అన్నారు. మంగళవారం మండలంలోని సోమక్కపేట్ పీఏసీఎస్ ఆవరణలో జిల్లా సహకార ఆడిట్ అధికారి కరుణాకర్, మండల వ్యవసాయాధికారి బాల్‌రెడ్డి సొసైటీ ఆధ్వర్యంలో రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. సాగులో ఉన్న ప్రతీ ఎకరాకు రైతు భరోసా ఇవ్వాలన్నారు. అది కూడా జూన్, డిసెంబర్ 30 వరకే రైతుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. రియల్టర్లకు, కమర్షియల్ భూములకు, సాగు చేయని భూములకు రైతుభరోసా నిలిపివేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి, డైరెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, సువర్ణ శ్రీనివాస్‌రెడ్డి, విఠల్, పోచయ్య, యాదాగౌడ్, పీఏసీఎస్ సీఈఓ పోచయ్య, మాజీ సర్పంచ్ లక్ష్మణ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చేగుంట(తూప్రాన్): మండలంలోని రెడ్డిపల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రైతుభరోసాపై అభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఏడీఏ వసంతసుగుణ మాట్లాడుతూ.. గ్రామాల్లో రైతులకు ఎంతవరకు రైతు భరోసా అందించాలనే విషయం తెలుసుకునేందుకు అభిప్రాయ సేకరణ జరుపుతున్నామని తెలిపారు. గ్రామాల్లో వ్యవసాయం చేస్తున్న పొలాలకు మాత్రమే రైతు భరోసా ఇవ్వాలని రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ మ్యాకల పరమేశ్, వ్యవసాయ అధికారి హరిప్రసాద్, వైస్ చైర్మన్ అంజనేయులు, సిబ్బంది నరేష్, సత్యం రైతులు పాల్గొన్నారు.

నార్సింగిలో...

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రం నార్సింగి సహకార సంఘంలో మంగళవారం అభిప్రాయాను సేకరించారు. ఈ సందర్భంగా ఏడీఏ వసంత సుగుణ మాట్లాడుతూ.. రైతు భరోసా విషయంలో రైతులు తమ అభిప్రాయాలను తెలియజేయాలని పేర్కొన్నారు. కొండలు గుట్టలకు రైతు భరోసా ఇవ్వరాదని రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో సీఈఓ నర్సింలు, వైస్ చైర్మన్ అంజనేయులు డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

అయిదు ఎకరాల వరకే ఇవ్వాలి

కొడిపల్లి(నర్సాపూర్): అయిదు ఎకరాలు సాగు చేస్తున్న భూములకు మాత్రమే రైతు భరోసా ఇవ్వాలని మెజార్టీ ప్రజలు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మంగళవారం కొడిపల్లి రైతువేదికలో మహ్మద్‌నగర్ సొసైటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, జిల్లా సహకార సంఘం ఆడిట్ అధికారి కరుణాకర్, ఏఓ స్వప్న ఆధ్వర్యంలో రైతు భరోసా అభిప్రాయ సేకరణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల రైతులు మాట్లాడుతూ.. అయిదు ఎకరాలలోపు సాగుభూమికి మాత్రమే రైతు భరోసా ఇవ్వాలన్నారు. గ్రామ కంఠం, కమర్షియల్ భూములు, పెట్రోల్‌బంక్‌లు, ఫాంహౌస్‌లు, రిసార్ట్‌లకు రైతు భరోసా ఇవ్వవద్దన్నారు. కేవలం రైతులు కష్టపడి సాగు చేస్తున్న భూమికి మాత్రమే రైతుభరోసా ఇచ్చి పెట్టుబడి సాయం ఎకరాకు రూ. 20వేలు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా అధికారి కరుణాకర్ మాట్లాడుతూ.. మెజార్టీ రైతులు అయిదు ఎకరాలలోపు సాగుభూమికి రైతు భరోసా ఇవ్వాలని అన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ స్వప్న, ఏఈఓ దివ్య, సొసైటీ సీఈఓ దుర్గాగౌడ్, వైస్‌చైర్మన్ చిన్నంరెడ్డి, మాజీ సర్పంచ్ శివాంజనేయులు, వీరయ్య, డైరెక్టర్లు రమేశ్‌గుప్తా, నర్సింలు, పోచయ్య, రామయ్య, వెంకట్‌రెడ్డి, బాలు, రాయగిరి, దుర్గారెడ్డి, సంజీవ్, బాలాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఇన్సూరెన్స్ చెక్కు పంపిణీ



బీమా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

కొడిపల్లి(నర్సాపూర్): బీఆర్‌ఎస్ పార్టీ ఇన్సూరెన్స్ చెక్కును ఎమ్మెల్యే సునీతారెడ్డి బాధిత కుటుంబానికి మంగళవారం పంపిణీ చేశారు. మండలంలోని కొట్టాల గ్రామానికి చెందిన కొడకండ్ల ప్రభాకర్ ఇటీవల ప్రమాదవశాత్తు చెరువులో మునిగి చనిపోయాడు. దీంతో అతనికి బీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వం ఉండటంతో రూ. 2లక్షలు ఇన్సూరెన్స్ డబ్బులు మంజూరయ్యాయి. దీంతో ఎమ్మెల్యే మృతుడి కూతురికి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ పద్మయ్య, రమేశ్‌గౌడ్, ఎంపీపీ రాజు, జెడ్పీటీసీ కవిత, మండలాధ్యక్షుడు రామాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గుట్కాలు విక్రయిస్తున్న వారిపై కేసు

నర్సాపూర్: ప్రభుత్వం నిషేధించిన గుట్కాలు, పాన్‌మసాలా అమ్ముతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పుష్పరాజ్ తెలిపారు. పట్టణ పరిధిలో తనిఖీలు చేసి, నిషేధించిన గుట్కా నిల్వ ఉంచడంతో పాటు అమ్ముతున్న ప్రవీణ్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు. రూ.35వేల విలువ చేసే నిషేధిత గుట్కాలను స్వాధీనం చేసుకొని సీజ్ చేశామని ఎస్‌ఐ తెలిపారు.

వీరభద్రాలయంలో చోరీ

టేక్మాల్(మెదక్): మండలంలోని బొడ్మట్‌పల్లి వీరభద్రాలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని దుండగులు ఆలయంలో చొరబడి వీరభద్రుడి వెండి కండ్లు, మీసాలు, వెండి నంది ప్రతిమ, భద్రకాళీ ఆలయం డోర్ తాళం పగలగొట్టి అమ్మవారి వెండి కండ్లు, బొట్టు, ముక్కుపుడక, బంగారు మంగళసూత్రం అపహరించుకుపోయారు. ఈ విషయాన్ని వీరభద్రాలయం కమిటీ చైర్మన్ పోలీసులకు సమచారం ఇవ్వడంతో ఈ సంఘటన స్థలానికి చేరుకొని వారు వివరాలు సేకరించారు. వారం రోజుల క్రితం హుండీ తాళం పగలగొట్టి డబ్బులు తీసుకునేందుకు ప్రయత్నించారు. అపహరణకు వచ్చిన దుండగులు సీసీ పుటేజీలో రికార్డు అయినట్లు ప్రజలు తెలిపారు.

టీచర్లను రిలీవ్ చేయాలి

పాపన్నపేట(మెదక్): బదిలీ అయిన ఉపాధ్యాయులను రేషన్‌లైజేషన్ పేరుతో రిలీవ్ చేయకపోవడం విచారకరమని ఎస్టీయూటీఎస్ మెదక్ అసోసియేట్ అధ్యక్షుడు దుర్గరాములు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. సుమారు 10 నుంచి 14 ఏళ్లుగా ఒకే పాఠశాలలో పని చేస్తూ ఎస్టీటీలు సాధారణ బదిలీలో భాగంగా జూన్ 30న స్థాన చలనం అయ్యారన్నారు. కానీ వారికి రిలీవ్ ఆర్డర్లు ఇవ్వకపోవడం విచారకరమన్నారు. ప్రభుత్వం వెంటనే రిలీవ్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆలయ వార్షికోత్సవం

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం వెల్దుర్తిలో హనుమాన్ ఆలయ తృతీయ వార్షికోత్సవ వేడుకలు నేత్రపర్వంగా కొనసాగాయి. ఉదయం నుంచే ఆలయ పరిసరాలు వేదపండితుల మంత్రోచ్ఛరణలు, హనుమాన్ నామస్మరణతో మారుమోగాయి. ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇనాం పట్టాలు ఇస్తాం

మెదక్ ఆర్డీఓ రమాదేవి

రేగోడ్(మెదక్): అర్హులను గుర్తించి ఇనాం పట్టాలు ఇస్తామని మెదక్ ఆర్డీఓ రమాదేవి అన్నారు. మండలంలోని ఆర్.ఇటిక్యాల గ్రామంలో మంగళవారం ఇనాం భూముల లబ్ధిదారులతో మాట్లాడుతూ.. భూమిలో పంటలు సాగు చేస్తున్నామని, పట్టాలు ఇవ్వాలని ఇటీవల సుమారు 27 మంది లబ్ధిదారులు మంత్రి దామోదర రాజనర్సింహను కోరారు. ఈ మేరకు ఆర్డీఓ గ్రామంలోని లబ్ధిదారులతో మాట్లాడారు. వారు కబ్జాలో ఉన్నారా లేదా, పంటలు సాగు చేస్తున్నారా అనే వివరాలను తెలుసుకున్నారు. అర్హులకు పట్టాలిస్తామని పేర్కొన్నారు.



ఆర్.ఇటిక్యాలలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న మెదక్ ఆర్డీఓ రమాదేవి

కార్యక్రమంలో తహసీల్దార్ బాలలక్ష్మి, ఆర్‌ఐ ఫెరోజ్ తదితరులు ఉన్నారు.

వైభవంగా 'కృష్ణానంద' జయంత్యుత్సవాలు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి కృష్ణానంద సరస్వతీ స్వామి జయంత్యుత్సవాలు మంగళవారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆశ్రమంలోని అమ్మవారికి, శివలింగానికి ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి చేశారు. అనంతరం కృష్ణానంద సరస్వతీ స్వామివారి పాద పూజ కనులపండువగా కొనసాగింది. ఈ సందర్భంగా మాధవానంద మాట్లాడుతూ.. సమాజంలో సనాతన ధర్మాన్ని, గురువు స్థానాన్ని పెంపొందించడంలో కృష్ణానంద స్వామి వారు ప్రచార కార్యక్రమాలు దేశంలోని అన్ని ప్రాంతాల్లో కొనసాగుతున్నాయన్నారు.





కార్యక్రమానికి హాజరైన భక్తులు, పాదుక పూజ చేస్తున్న మాధవానంద సరస్వతి

సంక్షిప్త వార్తలు

◆ పోస్టాఫీస్ తనిఖీ

కొడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి పోస్టాఫీస్‌ను సంగారెడ్డి డివిజన్ సూపరిండెంటెంట్ మురళి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోస్టాఫీస్‌లో రికార్డులు తనిఖీ చేశారు. రోజువారి ఉత్తరాల పంపిణీ, పింఛన్ డబ్బుల పంపిణీ ఇతర రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విధులపై అంకిత భావంతో పనిచేయాలని చెప్పారు. అనంతరం సూపరిండెంటెంట్‌ను బీపీఎంలు వీరేశ్‌గౌడ్, మోహన్‌రెడ్డి సన్మానించారు.

◆ గోశాలకు దాణా అందజేత

చేగుంట(తూప్రాన్): గోశాలలోని ఆవుల కోసం చేగుంట లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మందులను అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ.. నాగులపల్లిలోని గోశాలకు లయన్స్ ప్రతినిధి లింగమూర్తి సహకారంతో మందులతో పాటు దాణా అందించినట్లు తెలిపారు. లయన్స్ ప్రతినిధులు రామాచంద్రం, సంజీవ్, నాగేశ్వరయ్య పాల్గొన్నారు.

◆ వీడ్కోలు సమావేశం

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు వీడ్కోలు, నూతనంగా వచ్చిన ఉపాధ్యాయులకు ఆహ్వాన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సత్కరించారు.

◆ కొనసాగుతున్న పశువైద్య శిబిరాలు

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో పశువైద్య శిబిరాలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం వర్షాకాలం సీజన్‌తో పశువులు రోగాల బారిన పడకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని వీరోజిపల్లి తండాలో 127 పశువులకు లంపీస్కిన్ టీకాలు వేశారు. ఓఎస్ మహేందర్‌రెడ్డి ఉన్నారు.

◆ నియామకాలను వెంటనే చేపట్టాలి

పెద్దశంకరంపేట(మెదక్): కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల ప్రకారం ఉద్యోగ నియామకాలను వెంటనే చేపట్టాలని బీజెవైఎం ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ గ్రేస్‌బాయికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం అధ్యక్షుడు కృష్ణ మాట్లాడుతూ జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దేవీసింగ్, సురేష్ తదితరులున్నారు.

◆ రథోత్సవాలు జయప్రదం చేయాలి

నర్సాపూర్: హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఈనెల 7న నిర్వహించే మాదిగ దండోర రథోత్సవాలు జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు కుమార్ కోరారు. ఆయన పిల్లల పార్కులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద రథోత్సవ వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాగరాజు, సాగర్, చంద్రకాంత్, మోహన్, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.



బ్రాహ్మణపల్లిలో వన మొక్కలు నాటుతున్న గ్రామస్తులు

• బ్రాహ్మణపల్లిలో వనమహోత్సవం

వన మహోత్సవంలో భాగంగా మండలంలోని బ్రాహ్మణపల్లిలో జాతీయ ఉపాధి హామీ కూలీలతో పాటు గ్రామస్తులు కాంగ్రెస్ నాయకులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుధీర్ కుమార్ గౌడ్, మాజీ సర్పంచ్ ఆకుల మానెమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ పోచయ్య, నర్సింలు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్ రూరల్:

మట్టి అక్రమ రవాణాను అడ్డుకోవాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

రామాయంపేట(మెదక్): అధికారుల నిర్లక్ష్య వైఖరితో రామాయంపేటలో యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా కొనసాగుతుందని బీజేపీ నాయకులు ఆరోపించారు. పార్టీ పట్టణాధ్యక్షుడు భానుచందర్, రాష్ట్ర నాయకుడు నవాత్ రాజు ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంబంధిత అధికారుల సహకారం లేనిదే వేలాది ట్రిప్పుల మట్టి ఎలా అక్రమంగా ఎలా రవాణా అవుతుందని ప్రశ్నించారు. ఇకనైనా అధికారులు చర్యలు తీసుకోకపోతే పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. బీజేవైఎం నాయకుడు ప్రశాంత్, పట్టణాధ్యక్షుడు కన్నయ్య, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎల్లం, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

చేగుంట(తూప్రాన్): మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం ఎంపీపీ మాసుల శ్రీనివాస్ హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని గ్రామాలకు 13 హైమాస్ట్ లైట్లను మండల పరిషత్ నిధుల నుంచి మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో మండల పరిషత్ నిధులతో బోరు బావులతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ శంభునిరవి, నాయకులు నర్సింలు, బాలరాజు, రాములు, నజీర్, గ్రామస్తులు పాల్గొన్నారు.



రెడ్డిపల్లిలో హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న ఎంపీపీ శ్రీనివాస్

అధికారులపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ, బీఆర్‌ఎస్ నాయకులు

నర్సాపూర్: ప్రొటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని మండల జెడ్పీటీసీ సభ్యుడు బబియానాయక్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు నర్సింగ్‌రావు డిమాండ్ చేశారు. మంగళవారం ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఈనెల ఒకటిన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో తాము పాల్గొన్నామని తెలిపారు. కాగా అదే రోజు మండల నిధులతో నిర్మించ తలపెట్టిన షాపింగ్ కాంప్లెక్స్ శంకుస్థాపన చేసే విషయం తమకు చెప్పలేదన్నారు. శంకుస్థాపన చేసే విషయాన్ని అధికారులు తమకు చెప్పకుండా రహస్యంగా ఉంచడం విచారకరమని అన్నారు. తమతో పాటు మండలంలోని పలువురు ఎంపీటీసీలను ఆహ్వానించకుండా మండల నిధులతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సమావేశానికి పిలిచిన అధికారులు షాపింగ్ కాంప్లెక్స్ శంకుస్థాపనకు తమను ఎందుకు పిలువలేదని అధికారులను ప్రశ్నించారు. ప్రొటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. సమావేశంలో నర్సాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ నయిమోద్దీన్, బీఆర్‌ఎస్ నాయకులు సత్యంగౌడ్, జితేందర్ రెడ్డి, సూరారం నర్సింలు, ప్రసాద్, షేక్ హుస్సేన్ తదితరులు ఉన్నారు.

కిక్కిరిసిన ఎంఈఓ కార్యాలయం

నర్సాపూర్ రూరల్: ఎస్‌జీటీ ఉపాధ్యాయుల బదిలీలతో నర్సాపూర్ ఎంఈఓ కార్యాలయం రెండు రోజులుగా కిక్కిరిసిపోతోంది. నర్సాపూర్‌లో విధులు నిర్వర్తిస్తున్న బుచ్యానాయక్ 9 మండలాలకు ఇన్‌చార్జి ఎంఈఓగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఎస్‌జీటీ ఉపాధ్యాయులు బదిలీలు కాగా ఎంఈఓ ద్వారా రిలీవ్ అండ్ జైనింగ్ ఆర్డర్లు తీసుకోవాల్సి ఉంది. దీంతో నర్సాపూర్ ఎంఈఓ ఆఫీస్‌లో 9 మండలాల ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కార్యాలయంలో సరైన సదుపాయాలు లేక ఆరుబయట పడిగాపులు కాశారు.



నర్సాపూర్ ఎంఈఓ కార్యాలయం బయట పడిగాపులు కాస్తున్న ఉపాధ్యాయులు



అవగాహన కల్పిస్తున్న ఆర్డీఓ జయచంద్రారెడ్డి

డ్రగ్స్ వాడకం చట్టరీత్యా నేరం

తూప్రాన్: డ్రగ్స్ వాడకం చట్టరీత్యా నేరమని, యువత దూరంగా ఉండాలని ఆర్డీఓ జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణ పరిధి రావెల్లిలో కొనసాగుతున్న మహాత్మా జ్యోతిబా పూలే బాలికల బీసీ వేల్ఫర్ (నర్సాపూర్) పాఠశాలలో విద్యార్థినీలకు, ఉపాధ్యాయ బృందానికి, వేర్వేరుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు వ్యసనాలపై యువత, వారి తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. యుక్త వయస్సులో స్కూల్, కాలేజీలో విద్యార్థి యువత డ్రగ్స్ మహమ్మారి బారిన పడకుండా, వారి కెరీర్‌పై దృష్టి పెట్టాలన్నారు. యువత డ్రగ్స్‌కు అలవాటు కాకుండా సూచనలు చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్ష నెరవేర్చని ప్రభుత్వం

హవేళిఘణాపూర్(మెదక్): తెలంగాణ ప్రజల ఆకాంక్ష మేరకు ప్రభుత్వం పనిచేయడం లేదని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సతీష్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్ష మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగాల నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బీజేవైఎం ఆధ్వర్యంలో మెదక్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం సతీష్ మాట్లాడుతూ.. నీళ్లు, నిధులు, నియామకాలు అంటూ పోరాడి ప్రాణాలు పణంగా పెట్టి తెచ్చుకున్న తెలంగాణ ఇంకా ఉద్యోగాల నియామకాల్లో నిరుద్యోగులు మోసానికి గురవుతూనే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలని జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో తహసీల్దార్లకు వినతిపత్రం అందజేశామని తెలిపారు. బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ సాయిబాబా, ఉపాధ్యక్షుడు రాహుల్, మండలాధ్యక్షులు మార్గం రాజు, బబ్లు, అశోక్, బాబు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న బీజేవైఎం నాయకులు